సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం । 17 । అక్టోబర్ । 2024



స్కిల్ కేసులో చంద్రబాబు పెద్ద స్కెచ్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నిధులను స్వాహా చేయడానికి టీడీపీ అధినేత చంద్రబాబు పెద్ద స్కెచ్ వేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. - 8లో..



వైద్యరంగంలో అనస్తీషియాలజీకి ఎంతో ప్రాధాన్యత

వైద్య రంగంలో అనస్తీషియాలజీకి ఎంతో ప్రాధాన్యత ఉందని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
25.6 /23.9

జిల్లాలో బుధవారం 23.9 - 25.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

తెలంగాణలో రిపోర్టు చేసిన కలెక్టర్



కడప సెవెన్‌రోడ్స్ : కలెక్టర్ శివశంకర్ బుధవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రిపోర్టు చేసుకున్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు కేటాయించిన ఐఏఎస్‌లు వెంటనే రిలీవ్ అయి ఆయా రాష్ట్రాలకు వెళ్లాలని డిపార్టుమెంట్ ఆఫ్ పర్సనల్ ట్రైనింగ్ (డీఓపీటీ) ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. దీంతో కలెక్టర్ శివశంకర్ ఇక్కడి నుంచి వెళ్లి తెలంగాణలో రిపోర్టు చేశారు. ఆయన స్థానంలో కలెక్టర్‌గా ఎవరిని నియమిస్తారన్నది తెలియాల్సి ఉంది. కాగా.. ఈ ఏడాది జులై 6న కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శివశంకర్ ప్రజా సమస్యల పరిష్కారం మొదలుకొని ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. తొలి తెలుగుశాసనం లభించిన కలమల్లలో తెలుగుభాషా దినోత్సవాన్ని, అలాగే గండికోటలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు.

జేసీకి ఇన్‌చార్జి బాధ్యతలు..

కలెక్టర్ శివశంకర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రిపోర్ట్ చేసేందుకు వెళ్లడంతో జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలను జేసీ అదితిసింగ్‌కు అప్పగించారు.

నేడు వాల్మీకి జయంతి

కడప సెవెన్‌రోడ్స్ : మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలతో అలంకరణోత్సవం నిర్వహిస్తారన్నారు. ఉదయం పది గంటలకు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో జరిగే జయంతి ఉత్సవానికి జిల్లా అధికారులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు హాజరు కావాలన్నారు.

టెట్ పరీక్షకు 195 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 195 మంది గైర్హాజరైనట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలోని కడప, పొద్దుటూరులలో కలుపుకుని 8 పరీక్షా కేంద్రాలలో ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో నిర్వహించిన ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు–2024కు 1490 మందికిగాను 1295 మంది హాజరుకాగా 195 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు.

జిల్లా స్థాయి కుస్తీ జట్లు ఎంపిక

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి కుస్తీ జట్ల ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలను ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుద్ధ విద్యల్లో భాగమైన కుస్తీ ఆటలో జిల్లా క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి అండర్–14, అండర్ –17 విభాగాల్లో జిల్లా జట్లను ప్రకటించారు.

నేడు పాఠశాలలకు సెలవు

కడప ఎడ్యుకేషన్ : తుపాను కారణంగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితీసింగ్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలతోపాటు అంగన్వాడీ పాఠశాలలకు గురువారం సెలవును ప్రకటించినట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఈ సెలవును అన్ని యాజమాన్య పాఠశాలు అమలు చేయాలని డీఈఓ ఆదేశించారు.

దంచికొట్టిన వాన

- అల్పపీడనంతో జిల్లా అంతటా ఎడతెరిపి లేకుండా వర్షం
- జిల్లాలో పలు చోట్ల నీట మునిగిన ఉద్యాన పంటలు
- 2024.2 ఎకరాల్లో దెబ్బతిన్న వరి
- 254.5 ఎకరాల్లో మినుము నీటిపాలు
- జిల్లా రైతాంగానికి కోలుకోలేని దెబ్బ





కడప నగరం ఎన్జీఓ కాలనీలో వర్షపు నీటిలో వెళుతున్న బస్సులు (ఇన్‌సెట్) రామనపల్లిలో నేలకొరిగిన వరిపంటను చూపుతున్న రైతులు

కడప అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జిల్లాలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. దీంతోపాటు వ్యవసాయ, ఉద్యాన పంటలు నీట మునిగాయి. ఫలితంగా అన్నదాతలకు కొలుకోలేని దెబ్బతగిలింది. మొన్నటి వరకు వర్షాలు లేక సాగు చేసిన ఆరుతడి పంటలు సైతం నిట్టనిలువునా ఎండిపోయి రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. ఇప్పుడేమే తుఫాన్ కారణంగా జిల్లా అంతటా ఎడితెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు ఉద్యాన, వ్యవసాయ పంటల్లో నీరంతా నిలబడి అన్నదాతలు నష్టపోయారు. ఈ వర్షాలకు గ్రామీణ ప్రాంతంలో జనం జీవనం స్తంభించి పోయింది.

33 గ్రామాల పరిధిలో...

జిల్లాలోని పెన్నానది పరివాహక ప్రాంతాలైన చాపాడు, పొద్దుటూరు, చెన్నూరు, కడప, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల పరిధిలోని చాలా మంది రైతులు ముందస్తుగా వరిపంటను సాగు చేశారు. ప్రస్తుతం ఈ వరిపంట కొన్ని చోట్ల కోతదశలో ఉండగా మరి కొన్ని చోట్ల చిరుపొట్ట దశలో ఉంది. ప్రస్తుతం తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు 33 గ్రామాల పరిధిలో 2024.2 ఎకరాల్లో వరిపంట పూర్తిగా నేలమట్టమైంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరో వారం పది రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో వర్షం కురవడంతో నోటికాడికి వచ్చిన పంట నేలమట్టం అయ్యిందని అన్నదాతలు దిగులు చెందుతున్నారు. వర్షందాటికి నేలకొరిగిన వరికంకులకు మొలకొచ్చే ప్రమాదం ఉండటంతో వారు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు చిరుపొట్ట దశలో ఉన్న వరిపంటకు కంకిలోకి వర్షపు నీరు దిగి తెల్ల ఎన్ను వచ్చే అవకాశం ఉంది. అలాగే పత్తి కొన్ని చోట్ల కాయదశలో ఉంది. ఈ వర్షం నీరు కాయలోకి దిగి పత్తి దెబ్బతినే అవకాశం ఉంది. అలాగే ఎక్కువ వర్షం కురవడంతో పలు చోట్ల పత్తి పంటలో నీరంతా నిలిచింది. దీంతో పంట ఎర్రగా మారి దెబ్బతినే అవకాశం ఉండటంతో పత్తి రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా మంది రైతులు మినుము పంటను సాగు చేసుకున్నారు. ఈ పంటలో కూడా వర్షపు నీరంతా నిలబడింది. దీంతో జిల్లాలోని 254.5 ఎకరాలు మినుము పంట దెబ్బతినే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అలాగే చాపాడుతో పాటు దువ్వూరు మండలంలోని గుడిపాడు, చల్లబసాయిపల్లె, నారాయణరెడ్డిపల్లెలతో పాటు పలు పల్లెలో వర్షపు నీరంతా పంటపొలాల్లో పొంగి పొర్లింది.

కూలిన వంతెన : రాకపోకలు బంద్

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె వాగు ఉధృతికి గ్రామ సమీపంలోని లోలెవెల్ వంతెన పూర్తిగా కూలిపోయింది. దీంతో మండల కేంద్రానికి బుసిరెడ్డిపల్లెకు పూర్తి స్థాయిలో రాకపోకలు స్తంభించిపోయాయి. బుసిరెడ్డిపల్లె వాసులు మండల కేంద్రానికి రావాలంటే వేంపల్లె మండలంలోని రామిరెడ్డిపల్లెకు వెళ్లి వీరపునాయునిపల్లె రావాల్సి వస్తోంది. వంతెన కూలిపోకుండా ఉండింటే కేవలం 6 కిలోమీటర్లు ప్రయాణిస్తే మండల కేంద్రానికి చేరుకొనేవాళ్లు. ప్రస్తుతం దాదాపు 20 కిలోమీటర్లకు మించి ప్రయాణం చేయాల్సి వస్తోంది.

బుసిరెడ్డిపల్లె వాసులే కాకుండా అడవిచెర్లోపల్లె వాసులు కూడా ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

వర్షపాతం వివరాలు

పోరుమామిళ్లలో అత్యధికంగా 90.4 ఎంఎం వర్షం

కడప అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇందులో భాగంగా కడప, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల డివిజన్లలో భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో పోరుమామిళ్లలో ఈసారి అత్యధికంగా 90.4 ఎంఎం వర్షం నమోదయింది.

మండలం	నమోదైన వర్షపాతం(ఎంఎం)	మండలం	వర్షపాతం
		సిద్దవటం	35.8
		తొండూరు	34.6
పోరుమామిళ్ల	90.4	అట్లూరు	33.8
కాశినాయన	65.8	చక్రాయపేట	31.4
కలసపాడు	56.8	సింహాద్రిపురం	30.4
పెద్దముడియం	51.6	చెన్నూరు	30.4
ఒంటిమిట్ట	49.8	గోపవరం	30.2
దువ్వూరు	49.6	పులివెందుల	30.2
బిమఠం	48.6	వేముల	29.8
సికెదిన్నె	45.8	వల్లూరు	29.6
బికోడూరు	44.2	బద్వేల్	29.0
కడప	43.6	ముద్దనూరు	28.0
రాజుపాలెం	42.4	వీఎన్‌పల్లి	27.2
పెండ్లిమర్రి	41.8	కొండాపురం	25.6
కమలాపురం	40.8	లింగాల	25.2
ఖాజీపేట	38.4	మైలవరం	23.4
పొద్దుటూరు	36.2	మైదుకూరు	23.0
జమ్మలమడుగు	35.4	చాపాడు	22.2
వేంపల్లి	35.8	ఎర్రగుంట్ల	21.6

రిజర్వాయర్లలో జలకళ

కడప అగ్రికల్చర్ : జిల్లాలో పలు రిజర్వాయర్లు జలకళ సంతరించుకున్నాయి. జిల్లాలో తుఫాన్ కారణంగా పలు ప్రాజెక్టులకు వాటర్ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో ఇలా ఉంది.

ప్రాజెక్టుపేరు	ఫుల్ కెపాసిటీ టీఎంసీల్లో	ప్రస్తుత స్టోరేజి టీఎంసీల్లో	ఇన్ ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
చిత్రావతి	10.259	7.270	170	155
గండికోట	26.850	26.109	2260	1580
మైలవరం	6.500	5.865	2108	2050
పైడిపాలెం	6.000	5.323	0	20
సర్వరాయసాగర్	3.060	1.009	55	5
వామికొండ	1658	1400	0	15
ఎస్ఆర్–1	2.130	1.903	2283	2051
ఎస్ఆర్–2	2.447	1.885	2045	1980
బ్రహ్మసాగర్	17.735	6.866	1781	357
బుగ్గవంక	0.506	0.048	0	0
లోయర్ సగిలేరు	0.170	0.060	200	200

వర్షానికి కూలిన మిద్దె



పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి పాత ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని క్రిస్టియన్ కాలనీలో బుధవారం ఉదయం కౌన్సిలర్ కాంతమ్మకు చెందిన ఇల్లు నానిపోయి కూలిపోయింది. రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన చెందుతోంది. మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు కూలిన మిద్దెను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

కుందూనది వద్దకు రావద్దు



చాపాడు : తుఫానుతో మండలంలో కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో అన్నవరం, సీతారామాపురం గ్రామాల వద్ద కుందూ నది ప్రవాహాన్ని బుధవారం తహసీల్దారు రమాకుమారి పరిశీలించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో నది పరీవాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. రెండు గ్రామాల నది వద్ద గ్రామ సేవకులను పహారా పెట్టామని, ప్రజలు కుందూనది వద్దకు రాకూడదన్నారు.

గండికోట నీరు విడుదల



కొండాపురం : గండికోట జలాశయం నుంచి నీటిని మైలవరానికి విడుదల చేస్తున్నామని జల వనరుల శాఖ డీఈ ఉమా మహేశ్వరులు బుధవారం తెలిపారు. అవుకు రిజర్వాయర్ నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు గండికోటలోకి వస్తోంది. అలాగే రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి వాగులు, వంకల ద్వారా కూడా 2 వేల క్యూసెక్కుల వరద నీరు గండికోటకు చేరుతోందని ఆయన తెలిపారు. వచ్చిన ఇన్‌ఫ్లో నీటిని రెండు గేట్లు ఎత్తి మైలవరం జలాశయానికి విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతు కంట కన్నీరు



రాజుపాలెం: పత్తిపంటలో నిలిచిన వర్షం నీరు



రాజుపాలెం: నీట మునిగిన మినుము పంట



వేములలో ఉల్లి పంటలో నిలిచిన వర్షపునీరు



చెన్నూరు : నేల వాలిన వరి పంట



సీకెదిన్నెలో పూలతోటలో ..

వేంపల్లెలో వరి..

వేంపల్లె : మండలంలోని అలిరెడ్డిపల్లె, ఇడుపులపాయ, ఎగువ తువ్వపల్లె, వేంపల్లె, కుమ్మరాంపల్లె గ్రామాలలో వంద ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. బుధవారం మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ వరి పొలాలను పరిశీలించి పంట నష్టం అంచనా వేస్తున్నారు.

రాజుపాళెంలో పసుపు, పత్తి..

రాజుపాళెం : మండలంలో పత్తి, పసుపు, మొక్కజొన్న, మిరప, వరి, మినుము, పెసర, కొర్ర, జొన్న పంటలన్నీ దెబ్బతిన్నాయి. పంట నష్టం పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

చెన్నూరులో వరి..

చెన్నూరు : చెన్నూరు మండలంలో కోత దశలో ఉన్న వరి పంటకు నష్టం వాటిల్లింది. చెన్నూరు, రామనపల్లి, దౌలతాపురం, బయనపల్లి గ్రామాలలో పంటలను అధికారులు పరిశీలించారు. 982 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అంచనా వేశారు. అలాగే మొక్కజొన్న పంట కూడా దెబ్బతిన్నట్లు తెలిపారు. 12 రెవెన్యూ గ్రామాల్లో పంట నష్టంపై అధికారులకు నివేదికలు పంపనున్నామని స్థానిక అధికారులు తెలిపారు.

వేములలో ఉల్లి..

వేముల : పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా ముందుగా ఉల్లి సాగు చేసిన రైతులు ఉల్లి గడ్డలు తీసివేసి అమ్ముకున్నారు. అయితే వెనుకగా ఉల్లి సాగు చేసిన రైతులు ఉల్లి గడ్డలు పీకేందుకు మరో పది రోజుల పంట కాలం ఉండటంతో ఆగారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉల్లి పంటలో నీరు నిలిచింది. దీంతో నష్టపోయారు.

దెబ్బతిన్న వ్యవసాయ పంటల వివరాలు ఇలా..

మండలం	గ్రామాలు	రైతులు	వరి	మినుము	మొక్కజొన్న	మొత్తం
కమలాపురం	5	100	138.4	254.5	-	392.9
వల్లూరు	4	277	701.76	-	-	701.76
ఒంటిమిట్ట	4	48	90	-	-	90
బికోడూరు	1	10	30	-	-	30
చెన్నూరు	11	680	982	45	05	1032
కలసపాడు	3	17	25	-	-	25
మొత్తం	28	1132	1967.2	299.5	05	2271.6

మద్యం షాపు పెట్టొద్దని మహిళల ఆందోళన

- సాయంత్రం నుంచి రాత్రి వరకు కొనసాగిన నిరసన
- ఎట్టకేలకు ఎక్సైజ్ అధికారుల పరిశీలన
- షాపు జనసేన పార్టీకి చెందిన నాయకుడిది



ఎర్రముక్కపల్లిలో మద్యం షాపు వద్దని ఆందోళన చేస్తున్న మహిళలు



మహిళలకు సర్ది చెబుతున్న ఎక్సైజ్ అధికారులు

కడప అర్బన్ : కడప కార్పొరేషన్ పరిధిలో మద్యం షాపులను లాటరీ పద్ధతిలో కేటాయించారు. ఈ షాపులను నిబంధనల మేరకు పెట్టుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇందుకు విరుద్ధంగా కడప నగరంలోని ఎర్రముక్కపల్లిలో కంది పాలెం వీధికి వెళ్లే సందు ప్రారంభంలోనే ప్రధాన రహదారిలో మద్యం షాపును ఏర్పాటు చేసుకునేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. జనసేన పార్టీకి చెందిన కొందరు నాయకులకు నాలుగు మద్యం షాపులు రావడంతో వారిలో ఒకరు ఈ ప్రాంతంలో ఓ గదిని తీసుకుని మద్యం షాపును ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం ఫ్లెక్సీని ఏర్పాటు చేసి మద్యం స్టాక్‌ను తీసుకుని వచ్చేందుకు ఉద్యుక్తులయ్యారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక ప్రజలు, ప్రధానంగా మహిళలు మద్యం షాపు ఏర్పాటును తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. తమ వీధుల్లో సంసారాలు చేయాలా? వద్దా అంటూ పెద్ద ఎత్తున షాపును ఏర్పాటు చేయాలనుకున్న గది ముందు ఆందోళనకు దిగారు. తమ ప్రాంతంలో మద్యం షాపును పెట్టకూడదని అడ్డుకున్నారు. తమకు దగ్గరలోనే మసీదు, దేవాలయాలు వున్నాయని.. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని మద్యం షాపును పెట్టకూడదన్నారు. నిబంధనలను అతిక్రమించి మద్యం షాపును తెరిస్తే మద్యం సీసాలను సైతం పగులగొడతామని హెచ్చరించారు. సాయంత్రం నుంచి దాదాపు అర్ధరాత్రి వరకు వీరి ఆందోళన కొనసాగింది. ఎట్టకేలకు ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ తమ సిబ్బందితో వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపును పెడితే తాము కూడా ఒప్పుకోమని తెలియజేశారు. దీంతో మహిళలు శాంతించారు. కడప వన్‌టౌన్ సీఐ బి.రామకృష్ణ, పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు విధులను నిర్వహించారు.

మద్యం షాపు తెరిస్తే సహించం



మా ప్రాంతంలో మద్యం షాపును తెరిస్తే సహించం. సాయంత్రం ఎవరో వచ్చి మద్యం షాపును పెడుతున్నట్లు ఫ్లెక్సీ పెట్టేంతవరకు విషయం తెలియదు. దేవళాలు, మసీదు వుంటే మద్యం షాపును ఎందుకు పెడతారు? - నాగేశ్వరి

షాపు తెరిస్తే ఆందోళన తప్పదు



ఈ గదిలో ఎవరైనా సరే మద్యం షాపును పెడితే ఆందోళన చేపడతాం. ఎవ్వరినీ ఉపేక్షించేది లేదు. నిబంధనలు పాటించకపోతే ఎంతటివారినైనా ఎదిరిస్తాం. నిరంతరం ఆడవాళ్లు, చిన్నపిల్లలు ఇక్కడ తిరుగుతుంటారు. - నారాయణమ్మ

అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



కడప సెవెన్‌రోడ్స్ : తుఫాను కారణంగా జిల్లాలో మంగళవారం రాత్రి నుండి విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా ముందస్తుగా తీసుకున్న చర్యలు–తీసుకోవలసిన చర్యలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా జేసీ సమీక్షించి తగు ఆదేశాలు జారీచేశారు. ముందుగా ఆయా శాఖల అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆర్డీవోలు, తహశీల్దార్లను ఆదేశించారు. అనుకోని అత్యవసర పరిస్థితులు ఏర్పడితే అనువైన ఆశ్రయ కేంద్రాలను గుర్తించాలన్నారు. మున్సిపల్, వైద్య, ఆరోగ్యం, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ , విపత్తు నిర్వహణ (అగ్నిమాపక) తదితర శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు అందరూ జిల్లా కేంద్రం/ వారు పనిచేసే స్థానంలోనే అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు ఆగిపోయే వరకు సెలవులు మంజూరు చేయమన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్ కేంద్రాల్లో 24/7 పనిచేసే విధంగా కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామన్నారు. మండల కేంద్రాల్లో 24/7 పనిచేసే విధంగా కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలన్నారు.

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, కడప కంట్రోల్ రూమ్ : 08562 - 246344

ఆర్డీవో కార్యాలయం, కడప : 89854 29256

ఆర్డీవో కార్యాలయం, జమ్మలమడుగు : 96188 04882

ఆర్డీవో కార్యాలయం, బద్వేలు : 70133 23862

ఆర్డీవో కార్యాలయం, పులివెందుల : 85200 82425; 95422 99885

క్లుప్తంగా

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య


మృతి చెందిన నాగలక్ష్మి

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : సీకేదిన్నె మండలంలోని పెద్దకాంపల్లె పంచాయతీ కొత్తపల్లె గ్రామానికి చెందిన మహిళ నూకబోయిన నాగలక్ష్మి (38) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శంకర్ నాయక్ తెలిపారు. ఈమె భర్త రవి ఏడు సంవత్సరాల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి మనోవేదన పడుతూ జీవితంపై విరక్తి చెందిన ఇంటిలోని రేకుల షెడ్డుకు ఉండే పైపునకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందిందన్నారు. మృతురాలికి ఇరువురు కుమారులు ఉన్నారు.

ఫ్లైయాష్ టిప్పర్ బోల్తా


బోల్తా పడిన ఫ్లైయాష్ టిప్పర్

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని ఐసీఎల్ ఫ్యాక్టరీ సమీపంలోని ముద్దనూరు రోడ్డులో బుధవారంఫ్లైయాష్ బూడిద టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. రోడ్డుకు అడ్డంగా బూడద పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పాడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వెంటనే బూడిదను మరో టిప్పర్‌లోకి తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడిగా సీవీ ప్రసాద్


రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్


రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ

కడప ఎడ్యుకేషన్ : ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడిగా కడప జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా పని చేస్తున్న సీవీ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అన్నమయ్య జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ (పిఎస్) బి. రాధాకృష్ణలను ఎన్నుకున్నారు. ఇందుకు ఏపీటీఎఫ్ అమరావతి కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఆలీఖాన్, చెంగలరెడ్డి, ఉమాకాంత్ హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తులు ఫెడరేషన్‌కు ఎన్నుకోవడం పట్ల సమస్యల పరిష్కారానికి నాంది పలుకుతుందని తెలిపారు. జీవో 117 రద్దు, పీఆర్సీ, ఐఆర్, పెండింగ్ బకాయిలు, పదోన్నతుల్లో అసంబద్ధాలు, సీపీఎస్ రద్దు మొదలగు సమస్యలపై ప్రభుత్వంతో ప్రాతినిధ్యాలు చేస్తూనే పోరాటాలకు శ్రీకారం చుడదామని నూతన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.

స్కిల్ కేసులో చంద్రబాబు పెద్ద స్కెచ్

- ఆ నాడు చంద్రబాబును అరెస్ట్ చేస్తే పెద్ద ఎత్తున గగ్గోలు పెట్టారు
- నేడు అక్రమాలను రుజువు చేస్తూ మరిన్ని ఆస్తులను ఈడీ ఆటాచ్ చేసింది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : స్కిల్ డెవెలప్‌మెంట్ కేసులో నిధులను స్వాహా చేయడానికి టీడీపీ అధినేత చంద్రబాబు పెద్ద స్కెచ్ వేశారని వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. కడపలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు స్కిల్ డెవెలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేస్తే దత్తపుత్రుడు, భార్యా పిల్లలు నానా రాద్ధాంతం చేశారని.. ఆ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అరెస్ట్ చేయించారని గోల చేశారన్నారు. ఆ నాడు ఈడీ ఇచ్చిన సమాచారం మేరకే చంద్రబాబు అరెస్ట్ జరిగిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈడీ, సీబీఐ, సీఐడీ నివేదికల ప్రకారం కోర్టు ఉత్తర్వుల మేరకు చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఇప్పుడు ఈడీ దాన్ని మరోసారి రుజువు చేస్తూ మరికొన్ని ఆస్తులను ఆటాచ్ చేసిందన్నారు. గతంలో రూ.31.20కోట్ల ఆస్తులను ఆటాచ్ చేయగా, తాజాగా 23.54కోట్ల ఆస్తులను ఆటాచ్ చేసిందన్నారు. జాతీయ చానెళ్ల, పత్రికల్లో ఈ విషయం ప్రముఖంగా ప్రచురితమైందన్నారు. చంద్రబాబు అంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సరిపోలేదు కాబట్టే అరెస్ట్ చేయించారని దుష్ప్రచారం చేశారన్నారు. వాస్తవానికి స్కిల్ డెవెలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అన్నీ తానై వ్యవహరించారన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున నిధులు ఒకేసారి స్వాహా చేయాలని పన్నాగం పన్నారన్నారు. రూ.370కోట్ల ప్రాజెక్టును రూ.3700 కోట్లకు పెంచి అందులో 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేలా 90 శాతం సీమెన్స్ కంపెనీ భరించేలా ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. 90 శాతం నిధులను సీమెన్స్ కంపెనీ గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, డిజైన్ టెక్ అనే షెల్ కంపెనీతో ఎంఓయూ కుదుర్చుకున్నారని, జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి ఈ విషయం అసలే తెలీదన్నారు. ఒప్పందం కుదుర్చుకున్న సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి చెల్లించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.371 కోట్లను విడుదల చేసిందన్నారు. డ్రాఫ్ట నోట్లలో 13 చోట్ల చంద్రబాబు సంతకాలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారులను బెదిరించి, తొందరపెట్టి హవాలా రూపంలో ఆ డబ్బు చంద్రబాబుకు చేరేలా స్కెచ్ వేశారన్నారు. ఈ కేసులో చంద్రబాబు జైలుకు పోక తప్పదని రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. జగన్ ప్రభుత్వంలో ఉన్న 80లక్షల టన్నుల ఇసుక డంప్‌ను అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఖాళీ చేశారన్నారు. మద్యం టెండర్లలో టీడీపీ సిండికేట్ల వల్ల తెలంగాణ కంటే తక్కువ ఆదాయం వచ్చిందన్నారు. విజయవాడ వరద బాధితుల కోసం వచ్చిన విరాళాలను కూడా జేబులో వేసుకుంటున్నారని ఆరోపించారు.

మీడియా ఛానెళ్లను నిలుపుదల చేయడం దుర్మార్గం

రాష్ట్రంలో టీడీపీ నాయకుల దుర్మార్గాలు, ఆకృత్యాలు మితిమీరుతున్నాయని రవీంద్రనాథ్‌రెడ్డి మండిపడ్డారు. వారి అక్రమాలు, దౌర్జన్యాలు ప్రజలకు తెలియకుండా మీడియా గొంతు నొక్కడం దారుణమన్నారు. టీవీ9, సాక్షి, ఎన్టీవీ లతో పాటు మరి కొన్ని ఛానళ్లను ప్రసారం కాకుండా అడ్డుకుంటున్నారని.. ఇది ప్రజాస్వామ్యమో, నిరంకుశత్వమో అర్థం కావడం లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు పులి సునీల్‌కుమార్, నిత్యానందరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆహార దినోత్సవ వేడుకలు


ఆహార ఉత్పత్తుల తయారీ ప్రదర్శనను పరిశీలిస్తున్న అసోసియేట్ డీన్‌లు, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ అధ్యక్షతన 'ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హరిత, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కిశోర్ బాబు, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ నాగరాజులు హాజరై విద్యార్థులు తయారు చేసిన ఆహార ఉత్పత్తుల ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరుగైన జీవితం, మంచి భవిష్యత్తు కోసం సరైన ఆహారం గురించి తెలియజేశారు. దేశంలో భవిష్యత్తు అంతా ఫుడ్ ప్రాసెసింగ్ రంగానిదే అన్నారు. సరైన పౌష్టిక ఆహారం గురించి అందరికి అవగాహన కల్పించటంలో, ప్రాసెసింగ్ శాతం పెంచటానికి, ఫుడ్ వేస్టేజ్ అరికట్టడంలో ఫుడ్ టెక్నాలజిస్ట్‌ పాత్ర కీలకమన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు ఆహార కల్తీని ఎలా సులువుగా గుర్తించవచ్చునో ప్రదర్శన ద్వారా తెలియజేశారు. కళాశాల ఎల్‌బీఐ సెంటర్‌లో ఉన్న చిరుధాన్యాలు, పండ్ల ప్రాసెసింగ్ కోసం ఏర్పాటు చేసిన యంత్రాలు, ఉపయోగ వివరాలను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.మాధవ, ఎల్‌బీఐ సెంటర్ ఇంచార్జి ఇంజినీర్ నజ్మా, హఫీజ్, అధ్యాపకుడు డాక్టర్ సాయి శ్రీనివాస్‌లు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అరుణ, కీర్తి రెడ్డి, జయమ్మ, నివేదిత, డాక్టర్ సాయి శ్రీనివాస్, జాకీర్ బాషా, సుబ్బారెడ్డి, పీడీ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మేకల కాపరి అదృశ్యం


గంగిరెడ్డి (ఫైల్)

అట్లూరు : మేకలు తోలుకుని అడవికి వెళ్లి మూడు రోజులైనా ఇంటికి రాక పోవడంతో ఏమయ్యాడో ఏమో అని ఆ కుటుంబ సభ్యులు పడే ఆందోళన వర్ణనాతీతం.

మండల పరిధిలోని వరికుంట పంచాయతీ కలావాండ్లపల్లి గ్రామానికి చెందిన సొంటా గంగిరెడ్డి (60)కి భార్య, కుమారుడు ఉన్నాడు. మేకల కాపరిగా గంగిరెడ్డి జీవనం సాగిస్తున్నాడు. రోజూ లాగానే సోమవారం ఇంటి నుంచి మేకలు తోలుకుని మద్దూరు బీట్ అటవీ ప్రాంతానికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఇంటికి రాలేదు. ఆ రాత్రి గ్రామస్తులు అంతా సుమారు 60 మంది సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. కనిపించకపోవడంతో మంగళవారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. ఫలితం లేదు, అయితే మంగళవారం రాత్రికి మేకలు వాటంతట అవే ఇంటికి వచ్చాయి. మేకలు వచ్చి గంగిరెడ్డి రాక పోవడంతో కుటుంబ సభ్యుల్లో, బంధువుల్లో ఆందోళన ఎక్కువైంది. బుధవారం స్థానిక ఎస్‌ఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేదు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరగంరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా గ్రామస్తులతో పాటు సమీపంలో ఉన్న యానాదుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. గంగిరెడ్డి ఆచూకి కోసం అతడి కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు.


అటవీ ప్రాంతంలో గాలిస్తున్న గ్రామస్తులు

ఆర్టీసీ ఆదాయం అదుర్స్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు దసరా పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాలకు 283 ప్రత్యేక బస్సులను నడిపారు. 148360 కిలోమీటర్ల మేర బస్సులను తిప్పడం ద్వారా రూ. 59,38,002 ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజా రవాణాధికారి పి.గోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. విజయవాడకు 26 బస్సులు 21016 కిలో మీటర్ల తిప్పడంతో రూ. 877015, బెంగళూరుకు 69 బస్సులు 40472 కిలో మీటర్లు తిప్పడం ద్వారా రూ. 1621619, హైదరాబాద్‌కు 54 బస్సులు 46884 కిలోమీటర్లు తిప్పడం ద్వారా రూ. 1576594 ఆదాయం వచ్చిందన్నారు. చెన్నైకి 11 బస్సులు 7539 కిలో మీటర్లు తిప్పడం ద్వారా రూ. 338078 ఆదాయం సమకూరిందన్నారు. తిరుపతికి 46 బస్సులు 19827 కిలోమీటర్లు తిప్పడం ద్వారా రూ. 868022, కర్నూలుకు 8 బస్సులు 3396 కిలో మీటర్లు తిప్పడం ద్వారా రూ. 152956 ఆదాయం వచ్చిందన్నారు. ఇతర ప్రాంతాలకు 24 బస్సులు 9226 కిలో మీటర్లు తిప్పడం ద్వారా రూ. 503718 ఆదాయం ఒనగూరిందన్నారు. ఆర్టీసీ బస్సులను ఆదరించి ప్రయాణించి ఆదాయం వచ్చేందుకు తోడ్పడిన ప్రయాణికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందిని సిబ్బందిని అభినందిస్తున్నామన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

ప్రొద్దుటూరు క్రైం : రూరల్ పరిధిలోని ఆటోనగర్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో రూరల్ ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ బుధవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10,200 నగదును స్వాధీనం చేసుకున్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె : కోడిపందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టు టౌన్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వీవర్స్‌కాలనీ సమీపంలో కోడిపందెల నిర్వహణ జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. దాడిలో కోడి పందెం ఆడుతున్న నలుగురి వ్యక్తులను అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,020 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు


ఆర్టీసీ బస్సు-కారు ఢీకొన్న దృశ్యం

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె పరిధిలోని ఆర్టీపీపీ పవర్ గ్రిడ్ వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రాయచోటి నుంచి వస్తున్న కారు ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో కారులోని వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రాంతంలో జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్ల కారణంగా తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు వీటిని సత్వరమే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

మదనపల్లె : పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో మంగళవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పట్టణంలోని భవానీనగర్‌కు చెందిన జగదీష్ వద్ద అదే ప్రాంతానికి చెందిన దేవివరప్రసాద్ అలియాస్ దేవ ఎనిమిది నెలల క్రితం డబ్బు అవసరం పడటంతో రూ.40 వేలకు బుల్లెట్ వాహనాన్ని కదువపెట్టాడు. మంగళవారం రాత్రి జగదీష్ తన స్నేహితుడైన రెడ్డిబాషాతో కలిసి మల్లికార్జున సర్కిల్‌వద్ద ఉండగా, దేవివరప్రసాద్ అక్కడ కన్పించడంతో నగదు చెల్లించి వాహనం ఎప్పుడు తీసుకెళ్తావని ప్రశ్నించాడు. నలుగురిలో డబ్బులు అడుగుతావా అంటూ దేవీవరప్రసాద్ స్నేహితులైన సురేష్, వెంకి, భాస్కర్‌లతో కలిసి జగదీష్, రెడ్డిబాషాలపై దాడికి పాల్పడ్డారు. దాడికి పాల్పిడి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు


సతీష్ రాజు మృతదేహానికి లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : లక్కిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొండూరు సతీష్ రాజు అంత్యక్రియలు పోలీస్ లాంఛనాలతో నిర్వహించారు. రెండు రోజుల క్రితం విధుల నిర్వహణలో భాగంగా డ్యూటీకి వెళ్లుతున్న సమయంలో తన ద్విచక్రవాహనంపై నుంచి కిందపడి గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయన స్వగ్రామం అయిన రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామం వైకుంట రాచనల్లెలో బుధవారం జోరుగా కురుస్తున్న వానలో సైతం జిల్లా ఎస్పీ విద్యాసాగర్ రావు ఆదేశాల మేరకు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ ఆయన సిబ్బందితో కలసి అంత్యక్రి యలు నిర్వహించారు.

సూపర్‌సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరవైఫల్యం

రాయచోటి అర్బన్ : ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీల అమలులో ఘోరంగా విఫలమై ందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగార్రావులు విమర్శిం చారు. బుధవారం పట్టణంలోని లిబరేషన్ కార్యాలయంలో పార్టీ జిల్లా జనరల్‌బాడీ సమావేశం జిల్లా కన్వీనర్ ఎం.విశ్వనాథ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల అమలును గాలికి వదలేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్‌సిలెండర్‌ల పంపిణీ అంటూ గాలికబుర్లు చెబుతున్నారే తప్ప ఆచరణకు ముందుకు రావడం లేదన్నారు. తమ హామీల అమలు అంశంపై నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వం తిరుపతి లడ్డూ కల్తీవ్యవహారంపై రాజకీయం చేస్తుండడం దారుణమన్నారు. మద్యం షాపుల ఏర్పాటుపై కూడా ఎన్నడూ లేనంతగా ప్రచారం, హంగామా చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారాన్ని మరుగుపరుస్తున్నారంటూ మండిపడ్డారు. ముఖ్యంగా స్థానిక సమస్యల పరిష్కారంపై శ్రద్ధచూపక పోవడం దారుణమన్నారు. లిబరేషన్ పార్టీ కార్యకర్తలు స్థానిక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయ వలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ డిశెంబర్ 4వతేదీన విజయవాడలో భారీఎత్తున బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో లిబరేషన్ రాష్ట్రకమిటీ సభ్యులు ఉదయ్‌కిరణ్, సత్తార్, జిల్లానేత చెన్నయ్య, ఏఐఎస్ఏ జిల్లానేత లవకుమార్, నేత లు రమణ, రఘునాథ, సుజాత, నీలావతి, ఆంజనేయులు, పెద్దన్నతో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో అనస్తీషియాలజీకి ఎంతో ప్రాధాన్యత

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ


మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్ : వైద్య రంగంలో అనస్తీషియాలజీకి ఎంతో ప్రాధాన్యత వుందని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. ప్రపంచ అనస్తీషియా దినోత్సవం సందర్భంగా బుధవారం కడపలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణంలో వైద్య బృందం, వైద్య విద్యార్థులు సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ ఆధునిక వైద్య విధానంలో అనస్తీషియాలజీకి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌భాస్కర్ రెడ్డి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్ రెడ్డి, డాక్టర్ నూకరాజు, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోతి, ఐఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. వెంకటరాముడు, అనస్తీషియా హెచ్‌ఓడి డాక్టర్ సునీల్ చిరువెళ్లలు మాట్లాడారు. వృత్తిపరంగా అనస్తీషియాలజిస్ట్ అయిన దివంగత డాక్టర్ బండారు రవీంద్ర జ్ఞాపకార్థం సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోతి ప్రతి ఏడాది ఉత్తమ పోస్ట్ గ్రాడ్యుయేట్ అవార్డును ప్రదానం చేయడంలో చొరవతీసుకున్నారు. ఈ ఏడాది ఈ అవార్డును అవుట్ గోయింగ్ పీజీ డాక్టర్ డి. అనిల, శ్రీనాథ(బిఎస్‌సి), శివదుర్గలకు ప్రదానం చేశారు. నాగేంద్ర (డీఏఎన్ఎస్), భీమా (డీఎంఎస్‌టి) ఉత్తమ సాంకేతిక నిపుణులుగా అవార్డు పొందారు.

వైవీయూ పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

వైవీయూ ప్రవేశాల సంచాలకులు డా. లక్ష్మి ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వ విద్యాలయంలో ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం, ఎంపీఈడీ కోర్సులలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు యోగి వేమన విశ్వ విద్యాలయం ప్రవేశాల సంచాలకులు డా. లక్ష్మి ప్రసాద్ తెలిపారు. ప్రవేశానికి ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, 2 సెట్ల జిరాక్స్ కాపీలు, నిర్ణీత ఫీజుతో విశ్వ విద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలామ్ ప్రాంగణంలో వున్న ప్రవేశాల సంచాలకుల కార్యాలయం. (డీవోఏ)లో హాజరు కావాలని సూచించారు. ఏపీపీజీసెట్- 2024 ఎంట్రన్స్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. వివరాలకు yvu.edu.in ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం,ఎంపీఈడీ సబ్జెక్టుల వారీగా ఖాళీల ఉన్నాయని వివరించారు.

ఖాళీలు వివరాలు ఇలా..

ఇంగ్లీషు-35, తెలుగు -39, ఉర్దూ -26, జర్నలిజం -33, హిస్టరీ- 29, పొలిటికల్ సైన్స్- 26, ఎకనామిక్స్-41, కామర్స్ -37, బయో కెమిస్ట్రీ- 21, బయోటెక్నాలజీ -05, మైక్రో బయాలజీ -05, జెనెటిక్స్ సెండ్ జీనోమిక్స్-29, ఎన్విరాన్మెంటల్ సైన్స్ -31, బోటనీ -16, జువాలజీ-06, మ్యాథ్స్ -38, ఫిజిక్స్-26, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ -34, కెమిస్ట్రీ -9, జియాలజీ -26, సైకాలజీ -24; ఫిజికల్ ఎడ్యుకేషన్ -38, ఫుడ్ టెక్నాలజీ -22; కంప్యూటర్ సైన్స్ -13, కాంపిటేషనల్ డేటా సైన్స్-27ఖాళీలు ఉన్నాయని ప్రవేశల సంచాలకులు తెలిపారు.

'లగ్గం' సినిమాలో కడప యువతి గానం


గాయని మహతి

కడప కల్చరల్ : కడపకు చెందిన గాయని మహతికి సినిమాల్లో పాడే అవకాశం దక్కింది. ఈ నెల 25న విడుదల కానున్న లగ్గం సినిమాలో మహతి రెండు పాటలు పాడి అలరించారు. కడప నగరం మోచంపేటకు చెందిన మహతికి బాల్యం నుంచి సంగీతమన్నా, పాటలు పాడటం ఎంతో ఇష్టం. తండ్రి మాజీ కార్పొరేటర్ సురేష్ కుమార్తెను ఎంతో ప్రోత్సహించి అవసరమైన శిక్షణ ఇప్పించారు. కడప నగరంలో పలుమార్లు తన ప్రతిభ చూపి ప్రముఖుల ప్రోత్సాహం అందుకున్న మహతి హైదరాబాదుకు వెళ్లి తన ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నారు. అక్కడే పలువురు ప్రముఖ సంగీత దర్శకుల వద్ద మరింత సాధన చేశారు. పలు ఆడియో అల్బమ్స్ చేశారు. కొన్ని సినిమాలకు ఆమె సినీ దర్శకుల సూచనల మేరకు ట్రాక్‌లు పాడారు. ఇటీవల సుబిషి ఎంటర్‌ప్రైజెస్ నిర్మించిన లగ్గం సినిమాలో ఆమెకు రెండు పాటలు పాడే అవకాశం లభించింది. అందులో ఒకటి డ్యూయట్ కాగా, మరొకటి సహ గాయనితో కలిసి పాడారు. శరణ్ అర్జున్ ఈ సినిమాకు సంగీతం అందించారు. రమేష్ చప్పల దర్శకత్వం వహించిన ఈ సినిమాను వేణుగోపాల్ నిర్మించారు.

మద్యం దుకాణాల ఏర్పాటుపై వివాదం

ప్రారంభంకాని దుకాణాలు

ముద్దనూరు : మండల కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన రెండు మద్యం దుకాణాలు బుధవారం ప్రారంభం కాలేదు. ఇందులో ఒక మద్యం దుకాణానికి సంబంధించి అధికార పార్టీలోని ఓ వర్గం మరో వర్గానికి మధ్య వివాదం నెలకొంది. పోట్లదుర్తి బ్రదర్స్ వర్గానికి చెందిన ఓ వ్యక్తికి మద్యం దుకాణం మంజూరైంది. ఈ దుకాణం ఏర్పాటుకు అనువైన అద్దెగది కోసం ప్రయత్నిస్తుండగా మరోవర్గం వారితో కడప రహదారిలోని ఓ పెట్రోలు బంకు వద్ద వివాదం నెలకొంది. కొంతసేపు ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాగా ముద్దనూరుకు మంజూరైన రెండు మద్యం దుకాణాలు అధికార పార్టీ వర్గీయులకే దక్కాయి. అయితే వర్గపోరుతో రాత్రి వరకు రెండు దుకాణాలు ఏర్పాటుకాకపోవడం గమనార్హం.


20న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

– యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా


కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడపలోని యూటీఎఫ్ భవన్‌లో అక్టోబర్ 20వ తేదీ నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం కడపలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ మహాసభలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. స్వర్ణోత్సవ మహాసభలను పురస్కరించుకొని జిల్లాలో ఇప్పటికే పలు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించామని తెలిపారు. ఈ మహాసభలలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించి, సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాట కర్తవ్యాలను రూపొందించనున్నామని పేర్కొన్నారు. పాలకవర్గాలు ప్రభుత్వ విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, కడప నగర అధ్యక్షుడు కరీముల్లా, నాయకులు పెంచలయ్య, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జైలు శిక్షపడి పరారీలో ఉన్న వ్యక్తి అరెస్టు


అరెస్టు చేసిన వ్యక్తిని చూపుతున్న సీఐ రవిప్రకాష్ రెడ్డి

పెనగలూరు : చెక్కు బౌన్స్ కేసులో ఏడాది పాటు జైలు శిక్షపడటంతో పరారైన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. వివరాలిలా.. ప్రకాశం జిల్లా లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన పోలు మహేష్ అనే వ్యక్తి పెనగలూరు మండలం, సాతుపల్లి వద్ద చెల్లని చెక్కు ఇచ్చి నగదు తీసుకున్నాడు. చెక్కు బౌన్స్ కావడంతో నందలూరు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. దీంతో మహేష్ పరారయ్యాడు. హైదరాబాద్‌లో ఉన్నట్టు సమాచారం తెలుసుకొని ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో కానిస్టేబుల్ శివనాగేంద్ర, శివనాగరాజులు చాకచక్యంగా పట్టుకొని రూరల్ సీఐ బీవి రమణ వద్ద హాజరుపరిచారు. మహేష్‌ను కోర్టులో హాజరుపరచగా ఏడాది జైలు శిక్ష విధించడంతో కడప సబ్ జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం


ఎర్రచందనం దుంగలు, నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి

రామాపురం : కడప -రాయచోటి మార్గంలోని మేదరపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనల తనిఖీలు చేస్తుండగా ఇన్నోవా కారులో నాలుగు ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తూండగా వాహనంతో సహా దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లె సీఐ పర్యవేక్షణలో ముందస్తు సమాచారం మేరకు బుధవారం మేదరపల్లి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ చేస్తుండగా కడప వైపు నుంచి టయోటా ఇన్నోవా కారులో నాలుగు ఎర్రచందనం దుంగలు తరలిస్తూ వాహన తనిఖీలలో పట్టుబడ్డ నిందితుడు షేక్‌జిలాని బాషాను, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు.